డిస్లడ్జింగ్ ఆపరేటర్లు రక్షణ చర్యలు పాటించాలి

పీపీఈకిట్లు ధరించిన డిస్లడ్జింగ్ ఆపరేటర్లతో మున్సిపల్‌చైర్‌పర్సన్ రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, జనవరి 6: డిస్లడ్జింగ్ ఆపరేటర్లు తప్పకుండా రక్షణ చర్యలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితా వెంకన్న సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నమస్తే పథకంలో డిస్లడ్జింగ్ ఆపరేటర్లకు పీపీఈకిట్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండ్లలో స్లడ్జ్‌ను సేకరించే సమయంలో తప్పకుండా పీపీఈకిట్లను ఉపయోగించాలని సూచించారు. పట్టణ ప్రజలు తమ ఇండ్లలోని సెప్టిక్‌ట్యాంక్‌లను మూడు సంవత్సరాలకు ఒకసారి తప్పకుండా శుభ్రం చేయించుకోవాలని సూచించారు. మున్సిపల్‌వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్, డిస్లడ్జింగ్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు చర్యలు

మల్లన్న క్షేత్రంలో పర్యటిస్తున్న ఈవో రామాంజనేయులు

చేర్యాల, జనవరి 6 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. సోమవారం కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో ఆయన పర్యటించి కొన్ని నెలలుగా కొనసాగుతున్న క్యూలైన్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు, 50 కాటేజీల భవన నిర్మాణ పనులు, మల్లన్నగుట్ట పై నిర్మిస్తున్న ఢమరుకం,త్రిశూలం పనులను పరిశీలించారు. అనంతరం ఆలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆలయ పాలక మండలి సభ్యులు, అర్చకులు, అధికారులు, సిబ్బంది, ఒగ్గు పూజారుల సహకారంతో భక్తులకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. స్వామి వారి ఖజానాకు ఆదాయం పెంచి ఖర్చులు తగ్గించడమే తన ధ్యేయమని, అన్నివర్గాలు సహకరించాలని కోరారు. డోనర్ స్కీంలో భాగంగా మల్లన్న క్షేత్రంలో దాతల సహకారంతో 100 కాటేజీలు నిర్మించేందుకు విరాళాలు అందించే దాతలను కలుస్తామన్నారు. గదులు,లడ్డూ, పులిహోర, షెల్లాలను ఎవరికిపడితే వారికి ఇవ్వడం కుదరదని, అన్నదానం సత్రంలో భక్తులకు భోజనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై సంబంధిత ఇన్‌చార్జిలకు మార్గదర్శకాలు జారీచేస్తామన్నారు. ఆయనతో ఏఈవో, సూపరింటెండెంట్లు, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగులంటే సీఎం రేవంత్‌రెడ్డికి చిన్నచూపు

సిద్దిపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

సిద్దిపేట టౌన్,జనవరి 6 : రేవంత్‌రెడ్డి దివ్యాంగులను చిన్నచూపు చూస్తున్నారని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కెమ్మసారం అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద సోమవారం దివ్యాంగులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే 6 వేల పెన్షన్ ఇస్తామని నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం నేతలు సురేశ్, లక్ష్మణ్,వెంకటేశ్,రాకేశ్,మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సంతోష, నర్సింహులు, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై మహిళలు ధైర్యంగా పోరాడాలి

సమావేశంలో మాట్లాడుతున్న స్వాతిరెడ్డి

నారాయణరావుపేట, జనవరి 6 : లైంగిక వేధింపులపై మహిళలు ధైర్యంగా పోరాడాలని, ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బంజేరుపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పని చేసే చోట అనేకమంది లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎవరికైనా సమస్య ఉండే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలని, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీని ఆశ్రయించాలని సూచించారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్సై అపూర్వరెడ్డి, ఎంపీడీవో శ్రీరాములు, ఎంపీవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన ఉత్సవ్‌కు తరలిన రైతులు

జగదేవపూర్ నుంచి ఉద్యాన ఉత్సవ్‌కు తరలి వెళ్తున్న రైతులు

జగదేవపూర్ జనవరి 6: రాష్ట్రపతి నిలయం బొల్లారం నందు నిర్వహిస్తున్న ఉద్యానఉత్సవ్ కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల రైతులు సోమవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వసంతరావు మాట్లాడుతు ఉద్యాన ఉత్సవ్‌లో భాగంగా ఉద్యాన పంటలు, రకరకాల పూలమొక్కల సాగు పరిశీలించినట్లు తెలిపారు. ఉద్యాన పంటల్లో వచ్చిన ఆధునిక పద్ధతులపై ప్రత్యక్షంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌తో ఒప్పందం

మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌తోఒప్పందం కదుర్చుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్

గజ్వేల్, జనవరి 6: గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ శోభారాణి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ అనితాఅబ్రహం సమక్షంలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ మధ్య అవగాహన ఒప్పందం(ఎంఓయు)ను సోమవారం కుదుర్చుకున్నారు. మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ వారు నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా కళాశాలలోని ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఎంప్లాయిమెంట్ ఎబిలిటీ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, కెరీర్‌టాక్, సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి కళాశాల ప్రాంగణంలో నియామకాలు చేపట్టారు. స్కిల్స్ ద్వారా కళాశాల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ట్రైనర్ కుమారి రోహిణి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, శ్రీలత, లక్ష్మి, జయరాజ్, రమేశ్, శ్రీధర్, సందీప్ పాల్గొన్నారు.

ఉద్యోగి కారు టైర్లు మాయం

చేర్యాల, జనవరి 6 : వాహనదారులు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది. కొమురవెల్లిలో పార్క్ చేసి ఉన్న కారు టైర్లను ఎత్తుకుపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో పని చేసే ఓ ఉద్యోగి చేర్యాల-కొమురవెల్లి ప్రధాన రహదారి బస్టాండ్ సమీపంలో తన కారును పార్క్ చేసి ఈ నెల 3న రాత్రి తాను కిరాయికి నివాసం ఉంటున్న ఇంట్లో నిద్రించాడు. ఉదయం లేచి చూసే సరికి కారుకు ఉన్న నాలుగు చక్రాల్లో రెండు గుర్తు తెలియని వ్యక్తులు మాయం చేశారు.ప్రధాన రహదారి పక్కన పార్క్ చేసి ఉన్న కారు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు గ్రానైట్ రాళ్లను పెట్టి మరీ చక్రాలు మాయం చేయడంతో కంగుతిన్న ఉద్యోగి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేస్తున్నారు.

బీమా చెక్కు అందజేత

బాధిత కుటుంబానికి రూ.5లక్షల బీమా చెక్కు అందజేస్తున్న అధికారులు

దుబ్బాక,జనవరి 6: దుబ్బాక 108 అంబులెన్స్ ఫ్లైలెట్ కైరంకొండ లింగం మూడు నెలల కిందట మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులకు సోమవారం 108 నిర్వహణ సంస్థ (జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్) వారు జీటీఎల్ఐ బీమా ద్వారా రూ.5లక్షల బీమా చెక్కు అందజేశారు. మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్, సిద్దిపేట జిల్లా ఈఎంఈ హరే రామకృష్ణ, దుబ్బాక 108 అంబులెన్స్ సిబ్బంది ఎల్లప్ప, ప్రభాకర్, నాగరాజు,స్వామి పాల్గొన్నారు.

మందుబాబులకు కౌన్సెలింగ్

సిద్దిపేటలో మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట టౌన్,జనవరి 6 : మద్యం తాగి వాహనాలు నడిపిన మందు బాబులకు సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు.రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఏసీపీ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 80 మంది పట్టుబడగా వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్,ఎస్సై గోపాల్‌రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నంగునూరు: ఏఈవోకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అక్కన్నపేట: తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నల్లబ్యాడ్జీలు ధరించి చిన్నకోడూరులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సర్కార్‌పై నిరసన వెల్లువ

- మండల కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు
- ప్రభుత్వం పై మండిపడ్డ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా రూ.15వేలు కాకుండా రూ.12వేలు మాత్రమే ఇస్తానని మోసం చేయడంపై నిరసనలు వ్యక్తమయ్యాయి. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రజల ఆగ్రహావేశాలకు పతనం కావడం ఖాయమన్నారు.

-సిద్దిపేట జిల్లా నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, జనవరి 6

బెజ్జంకి: ఏవో సంతోష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నారాయణరావుపేట: గుర్రాలగొందిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు జర్నలిస్టులు

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌లో ఇండ్ల పట్టాల పంపిణీ అనంతరం జర్నలిస్టులతో మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 6: ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించడంలో ముందుండి పనిచేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లోని ఆర్డీవో కార్యాలయం సమావేశ మందిరంలో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన 40 మంది జర్నలిస్టులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కారం చేయడంలో జర్నలిస్టులు సహకరించాలని కోరారు. మండల, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న విలేకరులకు సైతం ఇండ్ల స్థలాల పంపిణీకి తనవంతు కృషి చేస్తానన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని విలేకరులందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వంతో మాట్లాడుతానని చెప్పారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు రాని జర్నలిస్టులు నిరాశపడొద్దని, త్వరలోనే అర్హులైన వారందరికీ స్థలాలు ఇస్తామన్నారు. కొద్ది రోజులుగా పెండింగ్‌లో ఉన్న ఇండ్ల పట్టాలను పంపిణీ చేయడం ఆనందంగా ఉన్నదన్నారు. ఇండ్లు పూర్తయ్యేందుకు కావాల్సిన నిధులు, ఇతర పనులను సత్వరంగా పూర్తి చేసేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రిని జర్నలిస్టులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, ఆర్డీవో రామ్మూర్తి, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పిట్టల తిరుపతి, చల్ల రాజు, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు నన్నె అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్ట్‌కు నిధులు మంజూరయ్యాయి

అక్కన్నపేట, జనవరి 6: గౌరవెల్లి ప్రాజెక్ట్ తుది దశ పనులకు నిధులు మంజూరయ్యాయని, కాల్వలకు భూసేకరణ జరుగుతుందని, ఇందుకు రైతులు సహకరించి, భూములు ఇస్తే మెట్ట ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం మండలంలోని రామవరంలో డబుల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...రామవరం- హుస్నాబాద్, అంతకపేట- కొత్తకొండ మధ్య డబుల్ బీటీ రోడ్ల నిర్మాణాలకు రూ. 50 కోట్లు మంజూరయ్యాయన్నారు. వచ్చే ఏడాదిలోగా రోడ్లు నిర్మాణాలు పూర్తికావాలని అధికారులకు సూచించారు. రామవరం నుంచి కొమురవెల్లి దేవస్థానం వరకు రోడ్డు నిర్మాణం చేపడుతామన్నారు. అక్కన్నపేట మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన చేసినట్లు చెప్పారు. వ్యవసాయ అనుబంధంగా ఉండే పరిశ్రమలు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ కారిడార్‌గా మార్చుతామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మార్కెట్ కమిటి చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, ముత్యాల సంజీవరెడ్డి, బుర్ర ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అక్కన్నపేట: రామవరంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సీఎం ఇచ్చిన హామీ మేరకు డివిజన్ ఏర్పాటు చేయాలి

చేర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ నాయకులు

చేర్యాల, జనవరి 6 : అధికారంలోకి రాగానే చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచార సందర్భంగా జనగామలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వెంటనే డివిజన్ కేంద్రం ఏర్పాటు చేయాలని జేఏసీ చైర్మన్ వకులభరణం నర్సయ్య పంతులు డిమాండ్ చేశారు.అన్ని అర్హతలు ఉన్న చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన బీఆర్ఎస్, సీపీఎం, బీజేపీ,టీడీపీ, టీఎమ్మార్పీఎస్‌తో పాటు విద్యార్థి,యువజన,కుల సంఘాల ప్రతినిధులు పట్టణంలో 100 కార్లతో భారీ ర్యాలీ నిర్వహించి, జిల్లా కేంద్రానికి తరలివెళ్లి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు ఆముదాల మల్లారెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య, బూరుగు సురేశ్‌గౌడ్, ఒగ్గు రాజుతో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. ఎన్నికల ముందు డివిజన్ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని అసెంబ్లీ తొలి సమావేశంలో, ఇటీవల ప్రభుత్వం దృష్టికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీసుకువెళ్లారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జేఏసీ కార్యవర్గం, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోరాటం ఆగదు

సిద్దిపేట కలెక్టరేట్,జనవరి 6: చేర్యాల రెవెన్యూ డివిజన్ అయ్యే దాకా ఉద్యమాన్ని ఆపేది లేదని జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్య పంతులు అన్నారు. సోమవారం చేర్యాల నుంచి సిద్దిపేట కలెక్టరేట్ వరకు సుమారు 80 వాహనాలతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపి కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. జేఏసీ నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ వంగ స్వరూపరాణి, ఆముదాల మల్లారెడ్డి, బొంగు రాజేందర్,ఆయా పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్,జనవరి 6: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ మందిరంలో ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన ఆర్జీదారుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లపై 96 దరఖాస్తులు వచ్చాయి. డీఆర్‌వో నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రహమాన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భయాన్ని వీడి పరీక్షలకు సిద్ధం కావాలి

గజ్వేల్, జనవరి 6: విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలకు సిద్ధం కావాలని, అప్పుడే అనుకున్న లక్ష్యానికి చేరుకుంటారని జీఎంఆర్ కళాశాల కరస్పాండెంట్ వంటేరు గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల బంగ్లా వెంకటాపూర్ జడ్పీ పాఠశాలలో పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించి చదువుకోవాలన్నారు. పరీక్షల సమయంలో సమయాన్ని వృథా చేయరాదన్నారు. హెచ్‌ఎం గోపాల్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో క్రికెట్ పోటీలు ప్రారంభం

బెజ్జంకి, జనవరి 6: మండల కేంద్రంలోని ఆర్‌వీఎంబీపీ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఎస్సై కృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ పోటీలు స్నేహపూర్వకంగా నిర్వహించుకోవాలని సూచించారు. రవి, మధు, వెంకటేశ్, లక్ష్మణ్, విజయ్, మల్లేశం, మహేశ్ పాల్గొన్నారు.

సిద్దిపేట, గజ్వేల్‌లో చైనా మాంజాలు స్వాధీనం

సిద్దిపేట టౌన్,జనవరి 6 : ప్రభుత్వ నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్న వ్యక్తిని సిద్దిపేట ట్రాన్స్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని సోమవారం కేసు నమోదు చేశారు.టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట టూటౌన్ సర్కిల్ పరిధిలోని పారుపల్లివీధిలో మురళి చైనా మాంజాను అమ్ముతున్నాడనే సమాచారం వచ్చిందన్నా రు. సిబ్బంది తో వెళ్లి అతడి ఇంట్లో తనిఖీ చేయగా లక్షా19వేల విలుగల చైనా మాంజా లభించిందన్నారు. మాంజాను స్వాధీ నం చేసుకొని అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

గజ్వేల్‌లో...

గజ్వేల్, జనవరి 6: ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని మహమ్మద్ గౌస్ కిరాణా దుకాణంలో నిషేధిత మాంజా అమ్ముతున్నాడనే నమ్మదగిన సమాచారంతో దాడులు నిర్వహించగా మూడు కిలోలు పట్టుబడడంతో స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ పోర్స్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బహుమతులు అందజేత

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 6: ఇటీవల మండల స్థాయిలో నిర్వహించిన సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్‌లో ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ డీఎన్‌టీ పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు రెడ్యానాయక్‌తండా యూత్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ధరావత్ శ్రీనివాస్‌నాయక్, సురేశ్, నరేశ్, సంతోశ్, సంపత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రెడ్యానాయక్‌తండా యూత్ సభ్యులు

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

హుస్నాబాద్‌టౌన్, జనవరి 6: హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. వివిధ వార్డులకు చెందిన మహిళలు పలు అంశాలపై ఆలోచింపజేసేవిధంగా ముగ్గులు వేశారు. ముఖ్యంగా మహిళలు బతకనివ్వ ండి...వీరిలో టీచర్, కలెక్ట, లాయర్ తోపాటు పలుబాధ్యతలు నిర్వహించేవారిని నవుతానంటూ ముగ్గులు వేశారు. ముగ్గులను మున్సిపల్ కౌన్సిలర్లు వాల సుప్రజ, బొల్లి కల్పన పరిశీలించారు.

తెలంగాణ సంస్కృతి పచ్చి కందుల పండుగ

పచ్చి కందులతో తయారు చేసిన వంటకాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేట టౌన్,జనవరి 6 : తెలంగాణ సంస్కృతి పచ్చికందుల పండుగ అని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అన్నారు.సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో పచ్చికందుల పండుగ మహోత్సవం జరిగింది.ఈ సందర్భంగా కళాశాలలో పచ్చి కందులతో చేసిన సంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. అధ్యాపకులు సంపత్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ, శైలజ,నరేశ్,రామస్వామి, నర్సింహులు, సాయిసురేశ్,వివిధ శాఖల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొమురవెల్లి, జనవరి 6 : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని కొమురవెల్లి, ఐనాపూర్, గౌరాయపల్లి, కిష్టంపేట, రాంగసాగర్ గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ మధు సోమవారం ప్రకటనలో తెలిపారు. మెరుగైన విద్యుత్ సరఫరాలో భాగంగా జరిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాని ఆయన కోరారు.

గ్రీన్ ఎరువులపై అవగాహన

కొండపాక(కుకునూరుపల్లి), జనవరి 6 : దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కొండపాక మండలంలోని విశ్వనాథ్‌పల్లిలోని క్షేత్ర స్థాయిలో రైతులకు గ్రీన్ ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు, వారి కుటుంబ సభ్యులకు పంట అవశేషాలు, వాటి నిర్వహణ, బయోచార్ తయారీ దాని ప్రయోజనాలు, వర్మిబెడ్ తయారీ, కంపోస్టింగ్ హెచ్ డీపీఎస్, బొటానికల్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కోడెల మల్లేశాన్ని ఉత్తమ రైతుగా గుర్తించి సర్టిఫికెట్ అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధులు టి.దుర్గయ్య, రవి, నరేందర్, నవీన్ పాల్గొన్నారు.

సకాలంలో లైవ్ సర్టిఫికెట్ సమర్పించాలి

చేర్యాల, జనవరి 6 : చేర్యాల ఎస్టీవో పరిధిలో ఉన్న 630 మంది పెన్షనర్లలో ఇప్పటి వరకు కేవలం 250 మంది మాత్రమే తమ లైవ్ సర్టిఫికెట్లు సమర్పించారని, మిగిలిన వారు వెంటనే సమర్పించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పుట్ట యాదయ్య, అధ్యక్షుడు ఎం.అంజిరెడ్డి కోరారు.తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండర్లను ఎస్టీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ తమ లైవ్ సర్టిఫికెట్‌ను మీ సేవ య